పర్యావరణహిత జీవనశైలి ప్రతి ఒక్కరి బాధ్యత

ముషీరాబాద్: పర్యావరణహిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా అనుసరించాలని ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ కోరారు. శనివారం డివిజన్‌లోని భరత్‌నగర్ సామాజిక భవనంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో త్రిపుర్ ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రిసైకిల్) రేపటి పర్యావరణ హిత జీవనశైలిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిసరాలు, పరిసరాల పరిశుభ్రతను ప్రజలంతా విధిగా పాటించాలన్నారు. ×మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ షహర్× నినాదంతో పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. డివిజన్‌ల వారీగా ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇళ్లలోని వ్యర్థాలు, పాడైన సామగ్రి, పాత దుస్తులు, పూలు, నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఇష్టానుసారంగా పారవేయకుండా ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో అందజేసి పేదలకు తోడ్పాటు, పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. 10 రోజులపాటు ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ – 15, ఏఎంఓహెచ్ డా.మైత్రేయి, ఎస్‌ఎఫ్‌ఏ గంగాధర్, నవీన్, బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, అనిల్‌కుమార్, రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ డీఎంసీ యాదయ్య

◆ రత్‌నగర్ సామాజిక భవనంలో ఏర్పాటుచేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని డీఎంసీ డా. తిప్పర్తి యాదయ్యతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు.

సలంద్రి రమేష్ యాదవ్‌కు కన్నీటి వీడ్కోలు

కవాడిగూడ: బీజేపీ సీనియర్ నాయకులు మహంకాళి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు సలంద్రి రమేష్‌యాదవ్ మృతి పార్టీకి తీరని లోటని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో ఆయన ఆకస్మికంగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన మృతి వార్త తెలుసుకున్న లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడకు చెందిన అన్ని పార్టీల నేతలు నివాళులర్పించారు. శనివారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో దోమలగూడ గగన్‌మహల్ సలంద్రి రమేష్ యాదవ్ అంతిమయాత్ర నిర్వహించారు. సాయంత్రం దోమలగూడ హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు ముగిశాయి. బీజేపీ నేతలు వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, పరిమళ్‌కుమార్, పీఎన్‌చారి, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, శివరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, కుమార్‌గౌడ్, హరీష్, అనిల్, గడ్డె శ్రీను, పరశురాం, బీఆర్‌ఎస్ నేతలు రాజశేఖర్‌గౌడ్, సాయికృష్ణ, ప్రభాకర్, సంతోష తదితరులున్నారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం ..

◆ రమేష్‌యాదవ్ మృతిపై హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం వ్యక్తం చేశారు. సమాజ సేవకు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన తనకు అత్యంత ఆత్మీయుడని సంతాప సందేశంలో వివరించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలిన భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు దత్తాత్రేయ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: మెగాసిటీ రాణి అవార్డులు, బిరుదులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైజ్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సెంట్రల్, వైఎస్‌ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వైఎస్‌ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి చెందిన యువ నాట్య కళాకారులు, గాయనీమణులు, నటీమణులు, సాంకేతిక, వైద్య, క్రీడ, సాహితీ, వ్యాఖ్యానం, మేథోసంపత్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెగా క్వీన్ ఆఫ్ ట్విన్‌సిటీస్ ఆఫ్ హైదరాబాద్ శీర్షికతో ఈ కార్యక్రమం జూన్ 11న బషీరాబాద్ బాబుఖాన్ ఎస్టేట్ వద్ద జరుగుతుందన్నారు. 18 నుంచి 30 ఏళ్లున్న యువతులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఆయా రంగాల్లో తమ ప్రతిభను కనబర్చినవారు 9849569626 (వాట్సాప్ నంబర్)కు కాల్ చేసి ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం

కాచిగూడ: హిమాయత్‌నగర్ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మల్లేష్ కుమార్‌ను కాచిగూడకు చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్‌ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించి అభినందించారు. రాజ్‌కుమార్, మదన్ యాదవ్, బబ్లూసింగ్, శేషు, అంటో, ఎస్‌ఎస్ రాము పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి


బండా ప్రకాష్‌ను కలిసిన రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్

కాచిగూడ: మత్స్యకారుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వ పరంగా తనవంతు కృషి చేస్తానని తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌గా ప్రభుత్వం నూతనంగా నియమించిన సందర్భంగా ఆయన శనివారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది డీఎల్ పాండు తదితరులున్నారు.

31న చలో 'బ్రాహ్మణ సదన్'

నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం గోపనపల్లిలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణసదన్ ప్రారంభోత్సవం ఈనెల 31న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఉంటుందని దీనికి బ్రాహ్మణ బంధువులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎ) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు బ్రాహ్మణులను కోరారు. శనివారం నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ.. ఉదయం బ్రాహ్మణ సదన్ ఆవరణలో చండీహోమం, సుదర్శనయాగం, సత్యనారాయణస్వామి వ్రతం ఉంటుందన్నారు. టీబీఎస్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, రాజేంద్రప్రసాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంత్రి సునీల్, ప్రచార కార్యదర్శి అక్కినేపల్లి పురుషోత్తంరావు, బాలచందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


గౌస్ పాషా (ఫైల్)

అంబర్‌పేట: పనికోసం బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట పటేల్ నగర్‌లో నివసించే గౌస్‌పాషా (30) పేయింటర్. కాగా ఈ నెల 19న పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లి రహ్మత్ ఉన్నీసా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


అబ్దుల్ ఖలీమ్ (ఫైల్)

కవాడిగూడ: భోలక్‌పూర్‌లో లారీపై విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడికి విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. భోలక్‌పూర్ ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ ఖలీమ్ (34) కు భార్య, నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆయన లారీలో లోడింగ్, అన్‌లోడింగ్ విధులు నిర్వహిస్తూ.. ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి భోలక్‌పూర్ బడిమసీద్ సమీపంలో లారీపై విధులు నిర్వహిస్తుండగా.. అక్కడే ఉన్న త్రీఫేస్ విద్యుత్‌తీగలు లారీకి తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి మంటలువచ్చాయి. లారీపై విధులు నిర్వహిస్తున్న నలుగురిలో ముగ్గురు గమనించి లారీపై నుంచి కిందకి దూకగా.. ఖలీమ్ భయంతో తానుకూడా దూకేందుకు ప్రయత్నించడంతో కిందపడి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఉత్తర్‌ప్రదేశ్‌లోని స్వగ్రామానికి తరలించారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజలకు పన్ను రాయితీలు అందించండి


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

కాచిగూడ: ధనిక కార్పొరేట్ అనుకూల విధానాలలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం రూ.2000 నోట్లను రద్దు చేసిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఆరోపించారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. నేటి ఆర్థిక పరిస్థితుల్లో అవసరమైంది నోట్ల రద్దు కాదని, ప్రజలకు పన్ను రాయితీలు అందించి వారికి ఊరట కలిగించాలని డిమాండ్ చేశారు. నల్లధనం రాబట్టి దేశ ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. 2016లో రూ.500, రూ.1000 నోట్ల రద్దుతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆర్థిక రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపిందని జీడీపీని (స్థూల జాతీయ ఉత్పత్తి) ప్రభావితం చేసిందని ఆమె వివరించారు. సమాజంలో వ్యాప్తి చెందుతున్న నల్లధనాన్ని అరికట్టడానికి నోట్ల రద్దు చేసి, కేంద్రం ఎంత మేర నల్లధనం సమీకరించిందని ప్రశ్నించారు. ఈ లెక్కలను దేశ ప్రజల ఎదుట బహిర్గతం చేయాలన్నారు.

'ది కేరళ స్టోరీ'ని ప్రతి ఒక్కరూ చూడాలి

కాచిగూడ: ప్రతి ఒక్కరూ 'ది కేరళ స్టోరీ' సినిమా చూడాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్ పేర్కొన్నారు. కళాశాలల విద్యార్థినీలను ప్రేమ పేరుతో మతం మార్చి.. తల్లిదండ్రులకు దూరం చేసి ఉగ్రవాదం వైపు ఏవిధంగా మళ్లిస్తున్నారో కళ్లకు కట్టినట్టు చూపించే 'కేరళ స్టోరీ'ని చూసి అవగాహన పెంచుకోవాలని సూచించారు. దుర్గా వాహిని, మాతృశక్తి ఆధ్వర్యంలో 100 మంది కళాశాల విద్యార్థినులు కాచిగూడలోని వెంకటరమణ థియేటర్‌లో సినిమాను తిలకించారు. వీహెచ్‌పీ నేతలు పుప్పాల వెంకటేష్, పగుడాకుల బాలస్వామి, పద్మశ్రీ, వాణి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాచిగూడ: రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా డాక్టర్ ఏఎస్ శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీమారావు నియామక పత్రాన్ని అందజేశారు. తెలుగుదేశం, సమాజ్ వాదీ పార్టీల్లో వివిధ స్థాయిల్లో పనిచేసిన అనుభవం శ్రీనివాస్‌కు ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, పెండ్యాల నర్సింగ్‌రావు తదితరులున్నారు.

డీఐ నరేష్‌కు సన్మానం

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ డీఐగా ఉన్న పి.నరేష్‌ను సెక్రటేరియేట్ పీఎస్ డీఐగా బదిలీ చేశారు. కాగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నూతన భవనంలోని తన చాంబర్‌లో ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ నరేష్‌ను శనివారం సాయంత్రం సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.

విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులు



విద్యార్థులతో ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ ఏకాగ్రతతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదిగి సమాజం గౌరవించేలా జీవించి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ విద్యార్థులకు సూచించారు. శనివారం ముషీరాబాద్‌లో రేడియంట్ హైస్కూల్‌లో 2022– 23 విద్యా సంవత్సరం ఎస్‌ఎస్‌సీలో 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థినీవిద్యార్థులను ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్‌లను మెమోంటో శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అన్వర్‌హుల్లా భక్తియార్, ప్రిన్సిపాల్ సయ్యద్ భక్తియార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కమిషనర్ కార్యాలయంలో చలివేంద్రం

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని తెలంగాణ కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభమైంది. తెలంగాణ ప్రాంతంలోని వివిధ జిల్లాల నుంచి కార్మిక కమిషనర్ కార్యాలయానికి రోజూ చాలా మంది వస్తుంటారు. వారి సౌకర్యం కోసం శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖ న్యాయవాది డీఎల్ పాండు ప్రారంభించారు. 15 రోజులపాటు ఈ చలివేంద్రం ద్వారా కార్మికులు, ఇతరులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. ట్విన్‌సిటీస్, రంగారెడ్డి జోన్ కార్మిక సంయుక్త కమిషనర్లు శ్యామ్‌సుందర్‌రెడ్డి, చతుర్వేది, డీసీఎల్‌లు శ్యామ్‌సుందర్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, ఏసీఎల్‌లుస్వామి, వెంకటరమణ, సత్యనారాయణరెడ్డి, ఇతర కార్మికశాఖ అధికారులు శిరీష, ప్రభాకర్, మూర్తి తదితరులున్నారు.


న్యాయవాది డీఎల్ పాండు, శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు

'బీసీలపై రాష్ట్ర ప్రభుత్వానిది సవతి ప్రేమ'


దశరథ లక్ష్మి

కాచిగూడ: బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి దశరథ లక్ష్మి విమర్శించారు. గత ఆరేళ్లుగా బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడం లేదని ఇప్పటికే రూ.5.20 లక్షల మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో కేవలం 10 శాతం మందికి మాత్రమే రుణాలు అందజేసి మిగిలిన వారిని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీల ఓట్లను కొల్లగొట్టేందుకు కులవృత్తుల వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇచ్చిన తరువాతే కొత్తవారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కేవలం కులవృత్తుల వారికి మాత్రమే రుణాలు ఇస్తామని చెప్పి మిగతా బీసీ కులాలను విస్మరించడం తగదన్నారు. బీసీ జాబితాలో ఉన్న 136 కులాల్లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రుణసాయం అందించాలన్నారు. బీసీ ఫెడరేషన్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆమె ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ



జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఇద్దరు అక్కాచెల్లెళ్లు కరాటేలో వరల్డ్ రికార్డ్స్ చేయనున్నారని అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీ.ఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. వరల్డ్ రికార్డ్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కరాటేలో శిక్షణ పొందిన అమృతరెడ్డి, సంతోషిణిరెడ్డిలు 9 నిమిషాల్లో 9 విభాగాల్లో 81 సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌తో వరల్డ్ రికార్డ్‌ను నమోదు చేస్తారని ప్రకటించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు రికార్డ్‌ను నమోదు చేసుకోనున్నారని వివరించారు. హైకోర్టు సీనియర్ అడ్వకేట్ అశోక్ ఆనంద్‌కుమార్, ఓయూ ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఉమా మహేశ్వర్‌రావు, మాడపాటి బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విజితారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులున్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా జూన్ 2న చేపడుతున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్‌ను శనివారం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ రాష్ట్ర ఇన్‌చార్జ్ అక్షయ్‌లక్రాతో కలిసి ఆవిష్కరించారు. ఎన్‌ఎస్‌యూఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అభిజీత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. 16 నుంచి 36 ఏళ్లున్న యువకులు రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజయం సాధించిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

డ్రైనేజీ పైపులైన్ పనుల పర్యవేక్షణ

కాచిగూడ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం కాచిగూడ డివిజన్ కుద్బిగూడలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ నేతలు సునిల్ బిడ్లాన్, బబ్లూసింగ్‌లతో కలిసి ఆయన పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఎవైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని బీఆర్‌ఎస్ నేతలు కోరారు.


పనులను పర్యవేక్షిస్తున్న బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్

డాక్టర్ కె. ధర్మారావుకు సత్కారం

కాచిగూడ: బర్కత్‌పురకు చెందిన అంతర్జాతీయ సినీ సాంస్కృతిక నిర్వాహకులు, డాక్యుమెంటరీ, లఘుచిత్రాల నిర్మాత సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు అమెరికాలో జరిగే పలు సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా శనివారం పలువురు సాంస్కృతిక అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనను అభినందించి సత్కరించారు. రేలంగి నరసింహారావు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వంశీ తదితరులున్నారు.


సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావును అభినందిస్తున్న దృశ్యం

రైల్లో ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగులు దొంగిలించిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన వ్యాపారి శంకర్‌లాల్ ఈనెల 17న మార్వార్ రైల్వే స్టేషన్‌లో కాచిగూడకు రావడానికి బికనీర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కాడు. జేబులో చూసుకునేసరికి సెల్‌ఫోన్ కనబడలేదు. బాధితుడు శనివారం కాచిగూడ రైల్వేపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం బికనీర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి పథకం ఎంతో అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అంబర్‌పేట మండల పరిధిలో 79 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అలీకేఫ్ చౌరస్తా ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో గొప్పవన్నారు. పేదవారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అండతో ఎలాంటి ఆందోళన లేకుండా ఆడపిల్లల వివాహం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తహసీల్దార్ లలిత, ఇతర మేనేజింగ్ సిబ్బంది, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

26 నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కాచిగూడ: వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి 31 వరకు వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రావు, టీటీడీ ఉప కార్యనిర్వహణ అధికారి ఎం.రమేష్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను శనివారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ బాలాజీమందిర్‌లో ఆవిష్కరించారు. 26న రాత్రి 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 27న ధ్వజారోహణం, శేష వాహనంపై పద్మావతీ గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు, హనుమంత వాహనం శ్రీవారి ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కమిటీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, భోజిరెడ్డి, వెంకటరమణరెడ్డి, ఆర్.క్రిష్ణ మోహన్, హరి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీ.వీ.భాస్కర్‌రావు, ఎం.రమేష్‌బాబు తదితరులు